సాక్షి బాపట్ల

సోమవారం ॥ 15 ॥ జనవరి ॥ 2024



వైభవంగా గోదా కల్యాణం

అమరావతి: అమరావతి పాండురంగస్వామి దేవాలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు. దేవాలయంలో వేకువ జామున పంచామృత స్నపన జరిపారు.



శ్రీవారికి అలంకారం

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని రైల్వే స్టేషన్‌రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీవారికి వేంకటపాండురంగస్వామి అలంకారం చేసి పూజలు జరిపారు.



శ్రీగోదా రంగనాథుని కల్యాణం

గుంటూరు ఎడ్యుకేషన్ : నంగడిగుంటలో ఆదివారం శ్రీగోదాదేవి రంగనాథుని కల్యాణాన్ని వేద పండితులు తాతాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. 50 మంది దంపతులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరాలయంలో భోగి వేడుకలు



అమరావతి: సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా ప్రసిద్ధ అమరేశ్వరాలయంలో ఆదివారం భోగి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ఈవో వేమూరి గోపీనాథ శర్మ ఆధ్వర్యంలో వేకువజామున భోగి మంటలు వేసి వేడుకలు ప్రారంభించారు. అనంతరం మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయం వద్ద మహిళలు రంగురంగుల ముగ్గులు వేసి, పాటలు పాడుతూ కోలాటం ఆడారు. అనంతరం కొత్త కుండలో స్వామివారికి అభిముఖంగా క్షీరాన్నం వండి, నైవేద్యం అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ భోగి పండగ విశిష్టతను వివరించారు. ఈ పండగతో పాడిపంటలతో పాటు ఆధ్యాత్మిక సంప్రదాయాల్ని ప్రజలు ఆచరించడం కోసం సంక్రాంతి నుంచి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమ వుతుందని తెలిపారు. అనంతరం పల్లకీలో అమరేశ్వరుడు, బాలచాముండేశ్వరీదేవి ఉత్సవమూర్తులకు మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. సంక్రాంతి ఉత్సవాలలో తొలి రోజున స్వామిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయంలో సంక్రాంతి పండుగ మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

19న గుంటూరు నుంచి విజయవాడకు పాదయాత్ర



నెహ్రూనగర్: ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ (స్మృతి వనం) ఈనెల 19న జరగనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం కోరారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే అత్యంత ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో 19న జరిగే ఈ బృహత్తర కార్యక్రమానికి లాడ్జి సెంటర్ నుంచి ఉదయం 6 గంటలకు పాదయాత్రగా వెళ్లనున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బహుజనులంతా హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు మంచాల జోసెఫ్, సముద్రాల కోటేశ్వరరావు, రాంబాబు, గోపి, కొరివి రజిని, సుభాని పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 521.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 4,986, ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 827.30 అడుగుల వద్ద ఉంది.

ఊరంతా భోగిభాగ్యం

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

- నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహణ
- భోగి మంటలతో ప్రారంభించిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రజిని
- ఉత్సాహంగా పాల్గొన్న నగరవాసులు
- ఆకట్టుకున్న గంగిరెద్దులు, డప్పు విన్యాసాలు, హరిదాసుల గానాలు
- వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు



గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా భోగి మంట వెలిగిస్తున్న మంత్రి విడదల రజిని, ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే గిరిధర్, మేయర్ కావటి, కలెక్టర్ వేణుగోపాలరెడ్డి



హరిదాసు వేషధారణలో ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరిధర్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం భోగి పండగను పురస్కరించుకుని ఉదయాన్నే మంటలు వేసి, సంబరాల్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంభించారు. సంబరాల సందర్భంగా స్టేడియంలో సందడి వాతావరణం నెలకొంది. భోగి మంటలు, రంగవల్లులు పండుగ వాతావరణాన్ని తలపించాయి. చెరుకు గడలతో అలంకరణ, అతిథులకు సన్నాయి మేళాలతో స్వాగతం, గంగిరెద్దులు, డప్పు కళాకారుల విన్యాసాలు పల్లె సంస్కృతిని ప్రతిబింబించాయి. కోడి పుంజుల ఆటలు, చిన్నారులకు భోగి పండ్లు పోయడం నగరవాసులకు సంస్కృతి, సంప్రదాయాల్ని జ్ఞప్తికి తెచ్చాయి.

సంబరాల నిర్వహణ అభినందనీయం

మంత్రి విడదల రజిని మాట్లాడుతూ పండగల సందడి అంటే పల్లెటూర్లేనని..అటువంటి పల్లెటూరి పండగ వాతావరణాన్ని గుంటూరు నగరపాలక సంస్థ సంక్రాంతి సంబరాలతో నగరవాసుల ముందుకు తీసుకురావడం అభినందనీయమన్నారు. నేటి తరానికి నాటి సంస్కృతి, సంప్రదాయాల్ని తెలియజేసేలా సంబరాలు జరుగుతున్నాయని తెలిపారు. నగరవాసులు కుటుంబ సభ్యులతో సంబరాల్లో పాల్గొని సంతోషంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు.



కోడి పందేలలో ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా, మంత్రి విడదల రజిని

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి తెలుగువారికి అతి ప్రధానమైన పండగ అన్నారు. కుటుంబ సభ్యులు ఎక్కడున్నా సొంత గ్రామాలకు వచ్చి జరుపుకుంటారని తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గత ఏడాది కూడా సంక్రాంతి సంబరాల్ని అద్భుతంగా నిర్వహించారని గుర్తు చేశారు.
- ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతూ పంట చేతికి వచ్చిన సందర్భంగా ఆనందంగా జరుపుకొనే పండగ సంక్రాంతి అన్నారు. నగర ప్రజలు సంక్రాంతి సంబరాల్లో కుటుంబ సమేతంగా పాల్గొని ఆస్వాదించాలని కోరారు.
- ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో జరిగే పండుగ శోభను నగర పాలక సంస్థ గుంటూరు నగర ప్రజలకు చేరువ చేసిందని తెలిపారు.
- మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ గత ఏడాది సంక్రాంతి సంబరాలను అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరుపుకున్నామన్నారు. ఈ ఏడాది కూడా అన్ని వయస్సుల వారిని అలరించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. సంప్రదాయ క్రీడలు, కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రతి రోజూ పండుగ వాతావరణం ఉంటుందని తెలిపారు.
- పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ పండగలు ప్రజల్లో ఐక్యతా భావాన్ని, కుటుంబ విలువలను చాటి చెప్తాయని పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల్లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అన్ని వర్గాల్ని అలరిస్తున్నాయని ప్రశంసించారు.
- తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ సంక్రాంతి ప్రపంచంలోని తెలుగు ప్రజలందరికీ ముఖ్యమైన పండగ అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంబరాల ద్వారా పండగ వాతావరణాన్ని ప్రజలు ఆస్వాదిస్తున్నారని తెలిపారు.
- సంబరాల్లో మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, ముస్తఫాలు పాటలకు నృత్యాలు చేస్తూ, హరిదాసు వేషధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ మహ్మద్ రఫిక్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



భోగి పండ్లు పోస్తున్న మంత్రి విడదల రజిని, ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యేలు

విశ్వాసంతో విజయం



సమష్టి దివ్యపూజా బలిని సమర్పించేందుకు వెళుతున్న కార్డినల్ పూల ఆంథోని

ఉంగుటూరు: బ్రదర్ జోసఫ్ తంబి ప్రార్థన, విశ్వాసం ద్వారా క్రీస్తు రక్షణను ఈ లోకంలో ఫలింపజేశారని గుంటూరు బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. మండలంలోని పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 79వ వర్ధంతి మహోత్సవాలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. ఉదయం 7గంటలకు గుంటూరు బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య తంబి సమాధి వద్ద ప్రార్థనలు నిర్వహించిన అనంతరం కళావేదికపై దివ్య పూజాబలిని సమర్పించారు. క్రీస్తులో విశ్వాసం ఉంచు వారంతా రక్షణ పొందుతారని బోధించారు. విశ్వసించిన వారు జ్ఞాన స్నానం పొంది పది ఆజ్ఞలను పాటిస్తూ ప్రార్థనతో జీవించాలని సూచించారు. కపూచియన్ ప్రొవెన్షియల్ ఫాదర్ మరియదాసు ప్రత్తిపాటి, పుణ్యక్షేత్ర రెక్టర్ పాలడుగు జోసఫ్, విచారణ ఫాదర్లు పూజానంతరం బిషప్‌ను ఘనంగా సత్కరించారు.

కిక్కిరిసిన క్షేత్రం..

ఉత్సవాల్లో రెండోరోజు ఆదివారం కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యాత్రికులతో పుణ్యక్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. సాయంత్రం 5గంటలకు హైదరాబాద్ అగ్రపీఠాధిపతులు కార్డినల్ పూల అంథోని తంబి సమాధిని సందర్శించి కళావేదిక వద్ద సమష్టి దివ్యపూజా బలిని సమర్పించారు. జోసఫ్ తంబిని ఆదర్శంగా తీసుకుని క్రైస్తవ విశ్వాసాన్ని బలపరచుకోవాలని పిలుపునిచ్చారు. ఫాదర్ జాన్, మాథ్యూస్ ఆధ్వర్యంలో సెయింట్ ఫ్రాన్సిస్, బ్రిందిసి బ్రదర్లు పాటలను ఆలపించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫాదర్లు, కన్యా స్త్రీలు, విశ్వాసులు పాల్గొన్నారు.

అద్దంకి అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి



సమన్వయకర్త హనిమిరెడ్డిని సత్కరిస్తున్న ఎన్ఆర్ఐలు

- సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి
- ఘనంగా ఎన్ఆర్ఐల ఆత్మీయ సమ్మేళనం

అద్దంకి రూరల్: అద్దంకికి పరిశ్రమలు తీసుకువచ్చి అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కూకట్ల కన్వెన్షన్‌లో ఎన్ఆర్ఐల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. హనిమిరెడ్డి మాట్లాడుతూ కులమతాలను పట్టించుకోకుండా ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానన్నారు. ఎవరూ అధైర్య పడొద్దని, తాను కష్టం విలువ తెలిసినవాడనని తెలిపారు. అద్దంకి నియోజకవర్గానికి చెందిన పలువురు ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువుల కోసం వేర్వేరు దేశాలు, రాష్ట్రాల్లో ఉన్నారని, ప్రతి ఒక్కరూ గర్వించేలా అద్దంకి ప్రాంతంలో పరిశ్రమలు స్థాపిస్తానన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి నమ్మి అప్పగించిన బాధ్యతను అందరి సహకారంతో నెరవేర్చి ఆయనకు అద్దంకిని బహుమతిగా అందజేస్తానన్నారు. గతంలో చూసిన ఎమ్మెల్యేకు భిన్నంగా పనిచేస్తానని తెలిపారు. అనంతరం వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన నాన్ రెసిడెన్స్ ఆఫ్ అద్దంకి బృందం సభ్యులు హనిమిరెడ్డిని సత్కరించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎల్.ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్‌లు పద్మేష్, అనంతలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గుజ్జుల బ్రహ్మారెడ్డి, పార్టీ అద్దంకి పట్టణ కన్వీనర్ కాకాని రాధాకృష్ణమూర్తి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బీవీ కృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపల్లెలో వైభవంగా భోగి వేడుకలు



వేడుకలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు దంపతులు

రేపల్లె రూరల్: నియోజకవర్గంలో భోగి పర్వదిన వేడుకల్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనారాయణుడి కృపకు పాత్రలై భోగములు అనుభవిస్తారన్న నమ్మకంతో వేకువజామునే యువకులు, పెద్దలు, మహిళలు పురవీధుల్లో మంటల్ని వేసి సందడి చేశారు. చలి కాసుకుంటూ కేరింతలు కొట్టారు. భోగి మంటల్లో వేడి నీళ్ల కాచుకుని స్నానమాచరించారు. నూతన వస్త్రాలతో పూజలు చేశారు. రేపల్లె పట్టణంలోని స్వగృహం వద్ద రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, అరుణ భాస్కరి దంపతులు భోగి మంటలు వేసి వేడుకల్ని ప్రారంభించారు. నియోజకవర్గ ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.

'స్పందన' రద్దు

బాపట్ల: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని సంక్రాంతి పండగ సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలో ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, అర్జీలు ఇవ్వడానికి కార్యాలయానికి రావద్దని ఆయన సూచించారు. పండగ అనంతరం స్పందనను యథావిధిగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

క్లుప్తంగా

పూలు కోస్తుండగా విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మార్టూరు: భోగి పండుగ రోజు దేవుడికి పూజ చేయడం కోసం పూలు కోస్తున్న ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈవిషాదకర ఘటన ఆదివారం ఉదయం మార్టూరులో జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. వలపర్ల గ్రామానికి చెందిన వెచ్చా సుబ్బారాయుడు అలియాస్ చిన్నబుజ్జి (60) మార్టూరులో సొంతంగా గ్రానైట్ ఫ్యాక్టరీ నిర్వహిస్తూ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం భోగి పూజ నిమిత్తం ఇంటి పైన ఉన్న మొక్కల నుంచి పూలు కోసేందుకు డాబాపైకి వెళ్లాడు. పూలు కోసే క్రమంలో ఏసీ కనెక్షన్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు సుబ్బారాయుడికి తగలడంతో కాంక్రీట్ దిమ్మెను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. భర్త ఎంతకూ కిందకు దిగి రాకపోవడంతో డాబా పైకి వెళ్లిన భార్య పరిస్థితిని గమనించి కేకలు వేస్తూ ఇరుగు పొరుగు వారిని పిలిచింది. సుబ్బారాయుడును పరిశీలించిన స్థానికులు అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరు అమెరికాలో ఉన్నందున వారు వచ్చేంత వరకు మృతదేహాన్ని భద్రపరిచేందుకు చిలుకలూరిపేట మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ మృతి

మృతుడు ఉత్తరప్రదేశ్ వాసిగా గుర్తింపు



రొంపిచర్ల: మండలంలోని అన్నవరప్పాడు గ్రామ సమీపంలో అద్దంకి–నార్కెట్‌పల్లి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ హైవేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. చెన్నై నుంచి హైదరాబాద్‌కు పాత ఇనుము లోడుతో వెళ్తున్న లారీ, హైదరాబాద్ నుంచి చెన్నైకు వెళ్తున్న కంటైనరు అన్నవరప్పాడు సమీపంలోకి రాగానే ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కంటైనర్ డ్రైవర్ పునీత్ కుమార్(24) మృతి చెందాడు. ప్రమాదంలో రెండు వాహనాలు ఢీకొనడంతో కంటైనర్ డ్రైవర్ క్యాబిన్‌లోనే చిక్కుకొని మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కేపీ.రవీంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతి చెందిన పునీత్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

బావిలో పడి ఆర్టీసీ మెకానిక్ మృతి

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెంది 18 రోజులు గడవకముందే కుమారుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందటంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అంబేడ్కర్ కాలనీకి చెందిన కంభంపాటి కోటేశ్వరరావు గత నెల 27వ తేదీన మార్కెట్ యార్డులో కూరగాయలు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా, కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో విషాదం అలుముకున్న ఇంటిలోనే మరో విషాదం చోటు చేసుకుంది. ఈయన పెద్ద కుమారుడైన కంభంపాటి వెంకటరావు (45) చిలకలూరిపేట ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పని చేస్తూ సోదరుడు రాంబాబుతో కలిసి గ్రామంలో కొంత పొలాన్ని సాగు చేస్తున్నాడు. ఆదివారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు ఇరువురూ వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో భోజనం తెచ్చేందుకు రాంబాబు ఇంటికి వెళ్ళాడు. ఈ సమయంలో వెంకటరావు ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. భోజనం తీసుకుని పొలానికి వచ్చిన రాంబాబు తన సోదరుడి కోసం వెతకగా బావిలో శవమై కనిపించాడు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తుంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి

నకరికల్లు: వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో హోంగార్డు మృతి చెందాడు. ఈ ఘటన స్థానిక అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన షేక్.సాయిబాబా (45) నరసరావుపేటలో ట్రాఫిక్ విభాగంలో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం విధులకు హాజరయ్యేందుకు తన ద్విచక్రవాహనంపై నరసరావుపేటకు బయలుదేరాడు. మార్గ మధ్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ క్రమంలో వెనుకనుంచి వస్తున్న లారీ సాయిబాబాను ఢీ కొట్టింది. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

వాస్తవాలను ప్రతిబింబించేవే నాటికలు

కొనసాగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలు



నాటిక పోటీలను ప్రారంభిస్తున్న తెళ్ల అరుణ, కందిమళ్ల జయమ్మ, ఇందిర, చంద్రకళ



రైతుభారతం నాటికలోని సన్నివేశం

యద్దనపూడి: సమాజంలో జరుగుతున్న వాస్తవాలను ప్రజలకు కళ్లకు కట్టినట్టు చూపించేవే నాటికలని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అన్నారు. ఆదివారం మండలంలోని అనంతవరం గ్రామంలో నాలుగో రోజు ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ద్వితీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల్లో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే కందిమళ్ల జయమ్మ, చిలకలూరిపేట ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు మారెళ్ల ఇందిర, కథ, నవల రచయిత్రి చంద్రలత పాల్గొన్నారు. తేళ్ల అరుణ మాట్లాడుతూ సమాజంపై ప్రభావం చూపించటంలో నాటికల పాత్ర కీలకమన్నారు. భాష ఉన్నతికి చిరునామాగా, సామాజిక హితాన్ని కాంక్షిస్తూ ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని వాస్తవ పరిస్థితులను పంచే నాటికలకు పూర్వవైభవం రావాలని ఆకాంక్షించారు. నవలా రచయిత్రి చంద్రకళ మాట్లాడుతూ కళాపరిషత్‌లే కాక ప్రభుత్వాలు, ప్రైవేట్ టీవీ చానళ్లు, ఆధ్యాత్మిక సంస్థలు కూడా నాటికలకు ప్రోత్సాహం అందించే ప్రయత్నం చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ భారతీయ సమాజాన్ని పట్టిపీడిస్తున్న వివక్షను నాటకం, నాటికలు ఎండగట్టాయని, సామాజిక వివక్షలకు వ్యతిరేకంగా నాటిక ప్రదర్శనలు ఓ ఉద్యమమే చేసిందన్నారు. అలాంటి కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు, మద్దినేని జయరామకృష్ణ, గుదే తారక రామారావు, పోపూరి హనుమంతురావు, కొరిటాల వంశీకృష్ణ, శివసుబ్బారావు, పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన నాటికలు..

నాలుగో రోజు తొలినాటికగా న్యూస్టార్ మోడరన్ థియేటర్స్ ఆర్ట్స్ విజయవాడ వారి 'కపిరాజు', రసఝరి పొన్నూరు వారి 'కాపల', శ్రీకారం రోటరీ కళాపరిషత్ 'రైతు భారతం' నాటికలు దేనికదే తమ ప్రత్యేకతను చాటుకున్నాయి. కళాకారుల ప్రదర్శనలతో వీక్షకులను రంజింపజేశారు.

సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

బాపట్ల: సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్, శాసన మండలి చీఫ్ విప్ ఉమారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ పోతుల సునీత, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాలు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రజలందరూ సంక్రాంతి పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని వారు కోరారు.

భోగి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ సునీత



భోగిమంట వద్ద ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల అర్బన్: భోగభాగ్యాల భోగి పండుగను ఆదివారం అద్దంకి, పర్చూరు, చీరాల పరిసర ప్రాంతాలలో ఎంతో ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారు జామున ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. అలాగే పిల్లలకు తలంటు స్నానం చేయించి, కొత్త బట్టలు వేసి భోగి పండ్లు పోశారు. చీరాల రూరల్ మండలం కావూరివారిపాలెం గ్రామంలో ఆదివారం భోగి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత, వైఎస్సార్ సీపీ నాయకుడు పోతుల సురేష్‌లు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఏర్పాటు చేసిన భోగి మంటల కార్యక్రమంలో పాల్గొన్నారు

కారంచేడులో ప్రముఖుల సందడి

సినీ, రాజకీయ ప్రముఖుల రాక



కారంచేడులో హీరో రానాతో గ్రామస్తులు

కారంచేడు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కారంచేడులో గ్రామానికి చెందిన సినీ, రాజకీయ ప్రముఖులు కుటుంబ సభ్యులతో సందడి చేశారు. శనివారం రాత్రికే గ్రామానికి చేరుకున్న మూవీ మొఘల్, సినీ నిర్మాత డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు కుమారుడు, సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు, ఆయన సతీమణి లక్ష్మి, హీరో దగ్గుబాటి వెంకటేష్, భార్య నీరజ, హీరో రానా, ఆయన సతీమణి మిహికా బజాజ్, సినీ హీరో అభిరామ్, ఆయన భార్య ప్రత్యూష, సురేష్‌బాబు కుమార్తె మాళవిక, రామానాయుడు సతీమణి రాజేశ్వరిలు గ్రామంలోని ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి ఆరాధ్యదైవం అయిన కట్టమల్లేశ్వర స్వామివారి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరావు, ఆయన సతీమణి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిలు కుమారుడు, కోడలు, కుమార్తె, అల్లుడు, పిల్లలతో గ్రామంలో భోగి పండుగ నిర్వహించారు. సినీ హీరోలైన రానా, అభిరామ్‌లతో గ్రామస్తులు సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపించారు.

తుదిదశకు జాతీయస్థాయి టీ-20 పోటీలు

సెమీస్‌కు చేరిన శ్రీకాకుళం, కామారెడ్డి జట్లు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న జీవనందన్



చెన్నై, కామారెడ్డి జట్లు మధ్య జరుగుతున్న మ్యాచ్

జే.పంగులూరు: సంక్రాంతి సందర్భంగా మండల పరిధిలోని కొండమంజులూరు గ్రామంలో పానెం హనిమరెడ్డిస్ జాతీయ స్థాయి టీ–20 క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఈపోటీలు చివరి దశకు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన మ్యాచ్‌లను చూసేందుకు క్రీడాభిమానులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు.

మ్యాచ్‌ల వివరాలు..

ఉదయం చిక్కోలు చీతాస్ (శ్రీకాకుళం), కేరళ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట టాస్ గెలిచిన శ్రీకాకుళం నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కేరళ 17.1 ఓవర్లలో 146 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. దీంతో శ్రీకాకుళం 75 పరుగుల తేడాతో విజయ సాధించి సెమీస్‌లోకి దూసుకెళ్లింది. శ్రీకాకుళం క్రీడాకారుడు బీఎస్ వినయకుమార్ 30 పరుగులు చేసి, బౌలింగ్‌లో 3 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ఎంపికయ్యాడు.

– మధ్యాహ్నం ఎంఆర్‌సీసీ (చెన్నై), లెవన్ బ్రదర్స్ (కామారెడ్డి) జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మ్యాచ్‌లో మొదట టాస్ గెలిచిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 16.3 ఓవర్లు ఆడి 89 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కామారెడ్డి 10 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసింది. దీంతో కామారెడ్డి 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో 3 వికెట్లు తీసిన కామారెడ్డి బౌలర్ జీవనందన్ మాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించాడు..

నేడు సెమీఫైనల్ మ్యాచ్‌లు..

సోమవారం ఉదయం మెదటి సెమీస్ మ్యాచ్‌లో బళ్లారి, లెవన్ బ్రదర్స్ (కామారెడ్డి) జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుంది. రెండో సెమీస్ మధ్యాహ్నం జార్ఖండ్, శ్రీకాకుళం జట్ల మధ్య జరుగుతుందని క్లబ్ చైర్మన్ కరణం స్వామి తెలిపారు.

సెమీస్‌కు చేరిన చెన్నై జట్లు

హోరాహోరీగా జాతీయస్థాయి క్రికెట్ పోటీలు



థండర్ బోల్ట్స్ తిరుపతి- చెన్నై మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్‌ను రన్ అవుట్ చేస్తున్న కీపర్



4 వికెట్లు తీసిన తరుణ్

మేదరమెట్ల: రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రావినూతల క్రికెట్ స్టేడియంలో నిర్వహిస్తున్న భ్రమర సంక్రాంతి కప్–2024 పోటీల్లో భాగంగా ఆదివారం జరిగిన రెండు మ్యాచ్‌లలో చెన్నై జట్లు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరాయి. ఉదయం శ్రీసీసీ (చెన్నై) -థండర్‌బోల్ట్ (తిరుపతి) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన తిరుపతి జట్టు ప్రత్యర్థి జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. బ్యాటింగ్ ఆరంభించిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. జట్టులో మురుగేష్ 34 నాటౌట్, వసీం 25 పరుగులు చేశారు. తిరుపతి బౌలర్లలో ప్రకాష్, నవీద్ చెరీ రెండు వికెట్లు తీశారు. అనంతరం 124 పరుగులు విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన తిరుపతి జట్టు పేలవ ఆట తీరుతో 11.3 ఓవర్లలో 44 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. చెన్నై బౌలర్లలో టి.తరుణ్ 2.3 ఓవర్లలో 7 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు తీసి తిరుపతి జట్టు వెన్నువిరిచాడు. దీంతో 79 పరుగుల భారీ తేడాతో శ్రీ సీసీ చెన్నై జట్టు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది.

– మధ్యాహ్నం ప్రసాద్ జీ స్పోర్ట్స్ లెవెన్ (హైదరాబాద్)– జీఎస్‌టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (చెన్నై) జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన హైదరాబాద్ బ్యాటింగ్ ఎంచుకొని 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. జట్టులో అభి 56 పరుగులు చేశాడు. చెన్నై జట్టు బౌలర్ చంద్రశేఖర్ 2 వికెట్లు తీశాడు. అనంతరం 142 పరుగుల విజయం లక్ష్యం కోసం బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 16.2 ఓవర్లలో నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి సునాయాసంగా విజయం సాధించింది. దీంతో జీఎస్‌టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (చెన్నై) జట్టు ఆరు వికెట్ల తేడాతో గెలుపొంది సెమీఫైనల్‌కు చేరుకుంది. జట్టులో కవిన్ 44 పరుగులు, సుధాన్ 32 పరుగులు చేసి జట్టు విజయానికి దోహదపడ్డారు.

నేడు సెమీ ఫైనల్స్‌లో తలపడే జట్లు..

ఉదయం మొదటి సెమీఫైనల్ చిక్కోల్ చీతాస్ (శ్రీకాకుళం)–శ్రీసీసీ (చెన్నై) జట్ల మధ్య జరుగుతుంది. మధ్యాహ్నం రెండో సెమీఫైనల్ జీఎస్‌టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (చెన్నై)–సౌత్ సెంట్రల్ సీసీ (చెన్నై) జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగనున్నట్లు అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు తెలిపారు.

గుర్తుకొస్తున్నాయి..!

35 సంవత్సరాల తర్వాత కలుసుకున్న మిత్రులు

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు యార్లగడ్డ నాయుడమ్మ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో 1989 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 35 సంవత్సరాల తరువాత మళ్లీ కలుసుకున్నారు. ఆదివారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత వైభవంగా జరిగింది. దేశ, విదేశాల్లో స్థిరపడి ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న వీరందరినీ ఒక తాటిమీదకు తీసుకురావడానికి కొంత మంది విద్యార్థులు నడుం బిగించారు. పాఠశాల ఆవరణలో కుటుంబ సభ్యులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. చిన్ననాటి ఊసులు నెమరవేసుకున్నారు. ఆడిన ఆటలు, పాడిన పాటలు, కోతి చేష్టలను నెమరవేసుకొని నవ్వుకున్నారు. కుటుంబ సభ్యులు, పిల్లలను పరిచయం చేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించుకున్నారు. ఆత్మీయ విందు ఏర్పాటు చేసుకొని అనుభూతులను నెమరవేసుకున్నారు. కార్యక్రమంలో పాదిలి శ్రీనివాసరావు, రాయిని శ్రీను, దిరిసాల నాగశ్రీను, జానీసైదా, నాగమణి, ప్రవీణ్, పద్మజ, వెంగమాంబ, వెంకటరమణ మిత్ర బృందం పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు.

క్వారీ నీటిగుంటలో పడి గొర్రెల కాపరి మృతి

అమరావతి: టీడీపీ పాలనలో డ్రెడ్జర్లతో ఇసుక తీయటం కారణంగా ఏర్పడిన గుంటలలో పడి ఇప్పటి వరకు సుమారు 23 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా తాడి ఎత్తు కుంటల కారణంగా శనివారం గొర్రెలు కాచుకునే ఓ యువకుడు బలయ్యాడు. మాచర్ల మండలం కొత్తూరు గ్రామానికి చెందిన గొర్రెల కాపరి జానపాటి వీరాంజనేయులు(35) తన గొర్రెల మందతో గొర్రెలు మేపటానికి కొండ ప్రాంతానికి చేరుకున్నాడు. రోజు లాగానే శనివారం గొర్రెలు మేపుకుంటూ కుంటలో గొర్రెలకు నీరు తాగిద్దామనే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు కాలుజారి కుంటనీటిలో పడి మునిగి చనిపోయాడు. సంఘటనపై దర్యాప్తు చేస్తున్నామని సీఐ బ్రహ్మం తెలిపారు. ఆదివారం కుంటలో పడి మృతి చెందిన వీరాంజనేయులు మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

పొట్టేళ్ల పోటీలు సంప్రదాయాలకు ప్రతీకలు

వైఎస్సార్ సీపీ అద్దంకి సమన్వయకర్త హనిమిరెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త హనిమిరెడ్డి

బల్లికురవ: సంక్రాంతి సందర్భంగా గ్రామ సంప్రదాయాలకు ప్రతీకగా పొట్టేళ్ల పోటీలు నిర్వహించడం అభినందనీయమని అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పాతమల్లాయపాలెంలో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పొట్టేళ్ల పందెపు పోటీల్ని ఆయన ఊపి ప్రారంభించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన 64 పొట్టేళ్లు తలపడ్డాయి. మూడు జిల్లాల్లోని పొట్టేళ్ల పెంపకందార్లు, భారీగా తరలి రావడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో సర్పంచ్ జూపల్లి రాఘవరావు, మాజీ సర్పంచ్ అబ్బారెడ్డి బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్దపాటి శంకర్, స్థానికులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

మొదటి బహుమతి మేదరమెట్లకు చెందిన ఎం.రవి కైవసం చేసుకోగా మాజీ సర్పంచ్ అబ్బారెడ్డి బాలకృష్ణ రూ.1 లక్ష అందించారు. రెండో బహుమతి ప్రకాశం జిల్లా పూరిమెట్లకు చెందిన కోణంకి శ్రీనివాసరావు, మూడో స్థానంలో బాపట్ల జిల్లా లింగాపురం గ్రామానికి చెందిన గుంజి రామకృష్ణ నిలిచారు. రెండు, మూడు బహుమతులు రూ.50 వేలు, రూ.30 వేలను గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్దపాటి శంకర్ అందించాడు. నాలుగో బహుమతి మేదరమెట్లకు చెందిన ఎం. సుబ్బారావు గెలవగా ఆయనకు రూ. 20 వేలను జడ వెంకట కోటేశ్వరరావు, సాంబశివరావు అందజేశారు.

జిల్లా స్థాయి రెజ్లింగ్ జట్లు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో ఆదివారం పల్నాడు జిల్లా మహిళా, పురుషుల రెజ్లింగ్ (కుస్తీ) జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా పురుషుల జట్టుకు ఎన్.దయాకర్, పి.నాగరాజు, సీహెచ్.అబ్రహాం, కె.లాలూనాయక్, జి.వాసు, పి.చలపతి, కె.రామకృష్ణ, ఎన్.ప్రసాదరావు, ఎన్.బాబు, ఎస్.బాలకోటేశ్వరరావు, ఎం.పెదరాయుడు, ఏ.విజయకుమార్, మహిళా జట్టుకు ఎస్.విజయకుమారి, ఆర్.దేవమణి, జి.నిటీషా ఎంపికైనట్లు అసోసియేషన్ కార్యదర్శి జి.భూషణం తెలిపారు. ఎంపిక పోటీలను డీఎస్ఏ కోచ్ కె.మనోహర్, అసోసియేషన్ సభ్యులు ఆర్.జేమ్స్, పి.మహేష్ పర్యవేక్షించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20, 21తేదీలలో కాకినాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని భూషణం తెలిపారు. ఈ సందర్భంగా సౌత్ ఇండియా రెజ్లింగ్ పోటీలలో 87 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించిన పి.నాగరాజును అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

క్లుప్తంగా

ప్రజలకు మోపిదేవి సంక్రాంతి శుభాకాంక్షలు



రేపల్లె రూరల్: భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచ దేశాలకు చాటిచెప్పే సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందంగా, వైభవంగా జరుపుకోవాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.ప్రభుత్వ పాలనలో అభివృద్ధి బాటలో రాష్ట్రం మరింత పురోగమించాలని కోరారు.

చిన్నారులకు భోగిపండ్లు

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరంలో ఆదివారం భోగి పండుగ సందర్భంగా స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు భోగిపళ్లు పోశారు. ఈ సందర్భంగా చిన్నారులకు పండితుల ఆశీస్సులు అందజేశారు. నిర్వాహకులు దీవి జ్యోతి మాట్లాడుతూ భోగి పళ్లతో ఆశీర్వచనం చేయడం వల్ల చిన్నారులకు దోషాలు తొలగి శుభాలు కలుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, ఆలయ అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి, వి. కోటేశ్వరరావు, కేబీవీ రమణ, జి. జగన్ మోహన్‌రావు, ఎన్.సూర్యనాగేశ్వరరావు, ఎం. గంగారావు తదితరులు పాల్గొన్నారు.

దండి పార్వతి అమ్మవారి ఊరేగింపు

భట్టిప్రోలు: సంక్రాంతిని పురస్కరించుకొని భట్టిప్రోలు గ్రామదేవత దండిపార్వతి అమ్మవారిని యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పురవీధుల్లో ఊరేగించారు. ప్రతి ఇంటి వద్ద అమ్మవారికి దివ్య నీరాజనాలు పలికారు.

బండ్లమ్మ వారికి విశేష పూజలు

చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలులో వేంచేసి యున్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ వారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి తరలి రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడింది.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో పండుగను నిర్వహిద్దాం



భట్టిప్రోలు: తెలుగు లోగిళ్లల్లో ఆనందాలు పంచే సంక్రాంతి పండుగ మనకు ప్రత్యేకమైన పండుగ అని వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు శనివారం పేర్కొన్నారు. ఈ పండుగతోనే మనకు కొత్త సంవత్సరంలో పండుగలు మొదలైనట్లు అవుతుందని తెలిపారు. నాలుగు నెలల కష్టానికి ఫలితంగా పంట చేతికి వచ్చిన అన్నదాతలు నలుగురితో కలసి తమ సంతోషాన్ని పంచుకునే మంచి పండుగ సంక్రాంతి అని చెప్పారు. ప్రజలంతా సుఖశాంతులతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

కనులపండువగా పుట్టలమ్మతల్లి సంబరాలు

గుంటూరు రూరల్: నల్లపాడు చల్లావారిపాలెం గ్రామ ప్రజల ఇలవేల్పు దేవత పుట్టలమ్మతల్లి ఘంటాలమ్మతల్లి ఆలయ సంక్రాంతి సంబరాలు కనుల పండుగగా జరుగుతున్నాయి. రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలను నిర్వహించారు.

కనుల పండువగా గోదా రంగనాథ స్వామి కల్యాణం



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి దంపతులు



గోదా కల్యాణంలో పాల్గొన్న భక్తులు

- అధిక సంఖ్యలో హాజరైన భక్తులు
- పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి దంపతులు

రేపల్లె రూరల్: పట్టణంలో ఉప్పూడి రహదారిలోని రాజ్యలక్ష్మి, గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ సింగిల్ ట్రస్టీ గడ్డం రాధాకృష్ణమూర్తి పర్యవేక్షణలో ఆదివారం గోదాదేవి, రంగనాథస్వాముల కల్యాణం ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే గోదాదేవి, రంగనాథస్వామి వార్ల విగ్రహాలకు వేద మంత్రాల నడుమ మంగళ స్నానాలు చేయించి వధూవరులుగా తీర్చిదిద్ది పట్టువస్త్రాలతో అలంకరించారు. మేళ తాళాలు, వేదమంత్రాల నడుమ కల్యాణం కన్నుల పండువగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వార్లను దర్శించుకుని విగ్రహ మూర్తులపై తలంబ్రాలు పోశారు. ఆలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి పూలంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు–అరుణ భాస్కరి దంపతులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని గోదా రంగనాథస్వామి కల్యాణ వేడుకల్లో తలంబ్రాలు పోశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు పసుపు, కుంకుమలను పంపిణీ చేశారు.



పూజలందుకుంటున్న గోదా రంగనాథ స్వామివార్లు

చెన్న కేశవుని ఆలయంలో గోదా కల్యాణం

జంపని(వేమూరు): జంపని గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ చెన్నకేశవ స్వామివారి ఆలయంలో ధనుర్మాస వ్రతంలో భాగంగా ఆదివారం భోగిపండగను పురస్కరించుకొని గోదా కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పండిత దీవి లక్ష్మీ నరసింహాచార్యులు ప్రధాన అచార్య స్థానంలో కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వెటరన్ క్రికెట్ మీట్‌లో క్రీడాకారుల సందడి



బాపట్ల క్రికెట్ అసోసియేషన్ వెటరన్ క్రీడాకారులు

బాపట్ల అర్బన్: బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల క్రికెట్ గ్రౌండ్‌లో బాపట్ల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెటరన్ క్రికెట్ మీట్ ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ మానం నాగేశ్వరరావు క్రీడలను ప్రారంభించారు. ప్రతి సంవత్సరం సంక్రాంతికి ముందు గత ఎనిమిది సంవత్సరాలుగా బాపట్ల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్ క్రికెటర్లు బందా బాబు, మదన్, విజయుడు, మహేష్, దొప్పలపూడి రామ్మోహన్, కె.రఘునాథ్, వై.నరేష్ బాబు, కె.సత్తిపండు, బక్క రోశయ్య, గంట అంజిబాబు, సురేష్ వర్మ, జానీ, నరేంద్ర, కరీమ్, స్టాన్లీ తదితరులు పాల్గొన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ స్వర్గీయ లేళ్ల రాంబాబు జ్ఞాపకార్థం ఆయన సోదరుడు లేళ్ల నరేంద్ర విజేతలకు మెమోంటోలను బహూకరించారు.

రేపు గ్రూప్-2 ఉచిత శిక్షణ

తెనాలిఅర్బన్: యూటీఎఫ్, జేవీవీ, ఎన్‌జీవో అసోసియేషన్ తెనాలి వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం గ్రూప్–2 ప్రిలిమ్స్‌లోని మెంటల్ ఎబిలిటీ సబ్జెక్టుపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేటలోని ఎన్‌జీవో కళ్యాణ మండపంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అమిరిశెట్టి శ్రీధర్ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రిలిమ్స్ పరీక్ష రాయనున్న విద్యార్థులు దీనిని ఉపయోగించుకోవాలని కోరారు.

ప్రజలకు ఈవూరి సంక్రాంతి శుభాకాంక్షలు



రేపల్లె రూరల్: నియోజకవర్గ ప్రజలు సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ ఆకాంక్షించారు. పాడిపంటలతో, సుఖ శాంతులతో జీవితాలు కొనసాగించాలని కోరారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

భావపురిలో హోరెత్తిన సంక్రాంతి సంబరాలు

- ఉర్రూతలూగించిన గాయనీ గాయకుల గీతాలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన జబర్దస్త్ కామెడీ షోలు
- ఎమ్మెల్యే కోన ఆధ్వర్యంలో వేడుకలు



గీతాలు ఆలపిస్తున్న గాయకులు

బాపట్ల: కోన ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో ఎమ్మెల్యే కోన రఘుపతి నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో సింహా బృందం ఆధ్వర్యంలో యువ గాయనీ, గాయకులు భావపురి ప్రజల మనసులను రంజింపజేశారు. కిక్కిరిసిన ప్రేక్షకులతో ఇసకేస్తే రాలనంతగా కళాశాల జనసంద్రంగా మారింది. దీనికి తోడు యువ గాయనీ గాయకులు పాడిన పాటలు ఆద్యంతం చూపరులను రంజింపజేశాయి. సింగర్ అండ్ రైటర్ బీమ్స్, డీజే సినీ హీరో సిద్దు జొన్నలగడ్డ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ప్రత్యేక ఆకర్షణగా జబర్దస్త్ కామెడి షోలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా జబర్దస్త్ కామెడీ షో నటులు చమక్‌చంద్రా, సత్తిపండు, పవన్, సత్యశ్రీ , భాస్కర్, నవసందీప్, పులి, నూకరాజు బృందాలు నిర్వహించిన కామెడీ షోలు భావపురి ప్రజలను మంత్రముగ్ధుల్ని చేశాయి. సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన సంగీత విభావరి కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ.. తన తండ్రి ప్రభాకర్‌రావు ఆశయాలు నెరవేర్చటంతో పాటు ఆయన అడుగు జాడలలో నడిచి బాపట్ల ప్రజల హృదయాలలో కోన కుటుంబం చెరగని ముద్ర వేసుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పండుగను మన ఇంట్లో మన కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవడం కాకుండా పది మందితో కలిసి జరుపుకోవాలనే నినాదాన్ని నాటినుంచి అమలుచేస్తూనే ఉన్నామన్నారు. అన్ని రంగాలను కలుపుకుంటూ పోతూ అందరినీ సంతోషంగా ఉంచేందుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు.

వరికూటిని కలిసిన కూచిపూడి గ్రామస్తులు



కూచిపూడి(వేమూరు): నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబుకు గ్రామస్తులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అమర్తలూరు మండంలోని కూచిపూడి గ్రామానికి చెందిన 11,12 వార్డులకు చెందిన ప్రజలు ఆదివారం అశోక్‌బాబును కలిశారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహారావు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో దుస్తులు పంపిణీ



తెనాలిటౌన్: లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు లయన్ మెల్విన్ జోన్స్ జన్మదినం సందర్భంగా పట్టణ గాంధీనగర్‌లోని సాయిసేవాసమితి ఆశ్రమంలో వృద్ధులకు, పేదలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బంజారా పెరల్స్ (హైదరాబాద్), వెంకటేశ్వర యోగసేవా కేంద్రం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్ జయామోహన్ బుర్రా, లయన్ శారదాచలపతి, ఎస్వీ యోగ కన్వీనర్ ఎం.రమణయ్య పాల్గొన్నారు.

వీ రిసార్ట్స్‌లో సినీ ప్రముఖుల సంక్రాంతి సందడి

హాజరైన కోన దంపతులు, సినీ ప్రముఖులు



బ్రోచర్‌ను ఆవిష్కరించిన కోన దంపతులు, సినీ ప్రముఖులు



సముద్రతీరంలో గాలిపటాలను ఎగ్గురవేస్తున్న హీరో సిద్దు జొన్నలగడ్డ

బాపట్ల: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని అడివిపాలెం గ్రామం దరి వీ రిసార్ట్స్ లో ఆదివారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా వీ రిసార్ట్స్ ఎండీ సంపత్ ఆధ్వర్యంలో కైట్ ఫెస్టివల్ జరిగింది. వీ రిసార్ట్స్ వద్ద ఉన్న సముద్ర తీరంలో జరిగిన కైట్ ఫెస్టివల్‌లో గుజరాత్ రాష్ట్రం నుంచి వచ్చిన పలు రకాల గాలిపటాలు ఎగుర వేశారు. తొలుత దీనికి సంబంధించిన బ్రోచర్‌ను బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, సినీ హీరో సిద్దు జొన్నలగడ్డ, కోన వెంకట్, కోన నీరజలు ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో కోన రఘుపతి సతీమణి రమాదేవి, సినీ నిర్మాత, రచయిత కోన వెంకట్, ప్రముఖ సినీ నటుడు సిద్ధూ జొన్నలగడ్డ, కాస్ట్యూమ్ డిజైనర్ కోన నీరజ, కోన అఖిల్, రిసార్ట్స్ మేనేజర్ గౌరీ కిషోర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయం

రాజ్యసభ సభ్యులు ఆయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్



హైస్కూల్‌లో అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎంపీ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్

మున్నంగి(కొల్లిపర): పాఠశాల అభివృద్ధి కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సహకరించి భావితరాలకు మౌలిక వసతులతో అదనపు తరగతి గదులు నిర్మించటం అభినందనీయమని రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని మున్నంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు నిర్మించిన గదులను ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన విధంగా శ్రద్ధగా చదువుకుంటే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నాడు–నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి, మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి వెంకటరామకృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ శివనాగిరెడ్డి, గ్రామ పెద్దలు ఆరిగ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలి

కొల్లిపర: భావితరాల వారికి మన సంప్రదాయాలను, పల్లెటూళ్లను గుర్తుకు చేయాలనే తలంపుతోనే స్థానిక శ్రీకళా నిలయం ఆధ్వర్యంలో ప్రతి ఏటా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సంక్రాంతి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త కూరపాటి రవిశేఖర్‌రెడ్డి అన్నారు.

ఆదివారం స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రాంగణంలో శ్రీ కళా నిలయం ఆధ్వర్యంలో సంక్రాంతి సాంస్కృతిక సంబరాలు ప్రాంభించారు. ఈ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన అవుతు కృష్ణారెడ్డ్ చేశారు. అనంతరం విద్యార్థుల ప్రత్యేక నృత్య ప్రదర్శనలు, చైతన్య కళాభారతి, కరీంనగర్ వారి స్వప్నం రాల్చిన అమృతం నాటిక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకళా నిలయం అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి గుడిబండి మహేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులు ఆరిమండ పెద్ద నాగిరెడ్డి, సహాయ కోశాధికారి అన్నవరపు రమేష్, కార్యవర్గ సభ్యులు ఆరిమండ శివశంకరరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిత్య సహాయమాత మహోత్సవం



నిత్య సహాయమాత మహోత్సవంలో మాట్లాడుతున్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: నిత్య సహాయమాత ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అంది ప్రజలంతా సంతోషంగా జీవించాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం నల్లపాడు గ్రామంలోని నిత్యసహాయమాత ఆలయ పండుగ మహోత్సవానికి సమన్వయకర్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానికంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదేవిధంగా స్థానికంగా ఉన్న లూథరన్ దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నిత్య సహాయ మాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బలసాని మాట్లాడుతూ ప్రజలంతా నూతన సంవత్సరంలో సంతోషంగా ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. నిత్య సహాయమాత చర్చిలో ఇలా పండుగ మహోత్సవాలు జరుపుకోవటం సంతోషకరమన్నారు. గ్రామ ప్రజలంతా సమష్టిగా ఏర్పడి పండుగను జరుపుకోవటం బాగుందని సంఘ పెద్దలను అభినందించారు. సంఘ పెద్దలు బలసానిని ఘనంగా శాలువాలు కప్పి సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను ఆశీర్వదించి ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్తగా పంపారని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజలు తమను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎప్పుడు ఎటువంటి సమస్య ఎదురైనా నేరుగా తనను సంప్రదించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నల్లపాడు డివిజన్ కన్వీనర్ దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నడవ వీరయ్య, ఆర్‌అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, లక్కిరెడ్డి మనోహర్‌రెడ్డి, కందుకూరి జ్యోతి, శానం చిన్నప్ప, దాసరి రవి, దాసరి నాగరాజు, గొట్టిముక్కల నాగరాజు, గుంటూరు కుటుంబరావు, గుంటూరు దావీదు, నాగరాజు, భాస్కర్, గోపి, ఆర్‌సీఎం చర్చి సంఘ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

అయోధ్యరాముని అక్షింతల పంపిణీ



పొన్నూరు: అయోధ్యరాముని అక్షంతలు, స్వర్శ పంపిణీ కార్యక్రమం శ్రీరామ మందిరం ధర్మకర్తలు చైర్మన్ పసులేటి శివ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పొన్నూరు, నిడుబ్రోలులో అక్షంతల కలశంతో ప్రధాన వీధుల్లో శోభాయాత్ర శ్రీరామ నామస్మరణతో జరిగింది. భక్తులు కలశాన్ని తమ తలపై ధరించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ దినం భారతీయులందరికీ పండుగ రోజు అని, ప్రతిష్ఠ ఆహ్వానం, రాములవారి అక్షంత ప్రసాదాన్ని పట్టణంలో ప్రతి కుటుంబానికి చేరుస్తున్నామని శివ తెలిపారు. వివిధ ప్రాంతాల ప్రజలు అందరి ఇళ్లకు చేర్చేందుకు అక్షింతలను తీసుకుని వెళ్లారు. ఆవుల సంఘం చలపతిరావు, బండారు శ్రీను, బావిరెడ్డి బ్రహ్మం, బావిరెడ్డి సుబ్బారావు, గద్దే రత్తయ్య, దాసరి రమేష్, తాడిశెట్టి గోపీరాజు, మహిళలు పాల్గొన్నారు.